# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people




## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
- టోల్‌ఫ్రీ నంబర్ 18004253424 లేదా 9154252936
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

03


గురువారం 24, సెప్టెంబర్ 2026 | సంపుటి : 03 | సంచిక : 205 | పేజీలు : 06 | వెల ₹5




# వినాయక సెలవిక

గంగమ్మ ఒడికి గణపయ్య

భక్తిశ్రద్ధల మధ్య గణనాథునికి ఘన వీడ్కోలు

చెరువుల వద్ద వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం

ప్రశాంత వాతావరణంలో శోభాయాత్రలు..

వర్షంలోనూ ప్రత్యేక పూజలతో సాగిన ఊరేగింపులు

06

తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న విఘ్నేశ్వరుడికి త్రిశీల నగరం భక్తిశ్రద్ధలతో ఘన వీడ్కోలు పలికింది. డప్పు చప్పుళ్లు, కోలాటాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ బుధవారం నగరంలోని గణనాథుల శోభాయాత్రలు వైభవంగా సాగాయి. చిరుజల్లులను సైతం లెక్కచేయకుండా భక్తజనం కదలిరావడంతో నగరం ఆధ్యాత్మిక శోభతో పులకించింది. జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 17 చెరువుల వద్ద అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయగా, ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జన పర్వం సాగింది. —అక్షరదర్బార్, వరంగల్

---

## వడ్ల కొనుగోలుకు 170 సెంటర్లు

- 1,05,400 టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం
- జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్

04



## పెన్షన్ కలెక్షన్స్

**పింఛన్ దరఖాస్తుదారుల నుంచి అధికారుల వసూళ్ల పర్వం!**

- రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు
- కొర్రీల పేరుతో భయాందోళనలు..
- పారదర్శకంగా అమలు చేయాలని బాధితుల వేడుకోలు

అర్హులైన లబ్ధిదారులందరికీ కొత్త పెన్షన్లు అందజేయాలనే ప్రభుత్వ ఆశయానికి క్షేత్రస్థాయి అధికారులు, చోటామోటా నాయకులు గండికొడుతున్నారు. నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియలో తీవ్రస్థాయిలో వసూళ్ల పర్వం సాగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికి పెన్షన్ మంజూరులో నిబంధనలు పక్కన పెడుతున్న అధికారులు, ఇతరులకు మాత్రం రకరకాల కొర్రీలు పెడుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

_ అక్షర దర్బార్, నర్సంపేట

05



# వైద్య సేవల్లో డాక్టర్ సౌందరయ్య ముద్ర చిరస్మరణీయం

- 25వ వర్ధంతి వేళ బీజేపీ నేతల ఘన నివాళులు



అక్షరదర్బార్, పరకాల: పేదలు, సామాన్యులకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ ప్రజా సేవలో చెరగని ముద్ర వేసిన ప్రముఖ వైద్యుడు దివంగత డాక్టర్ సిరంగి సౌందరయ్యకు బీజేపీ పరకాల పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఘన నివాళుల ర్పించారు. పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాల యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కుమారుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కు మార్ సౌందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ పరకాల ప్రాంత ప్రజలకు నిస్వార్థ వైద్య సేవలు అందిస్తూ పేదల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిన సౌందరయ్య సేవలను ప్రజలు నేటికీ స్మరించుకుంటున్నార న్నారు. ప్రజా సేవను పవిత్ర బాధ్యతగా భావించి పనిచేసిన ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని తెలిపారు. 2001 సెప్టెంబరు 23న నక్సలైట్ హింసలో డాక్టర్ సౌందరయ్య హత్యకు గురయ్యారని, ఆయన సేవలను స్మరించు కుంటూ ఏటా వర్ధంతి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కుక్కల విజయకుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆర్పీ జయంతిలాల్, దేవునూరి మేఘనాథ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు చందుపట్ల చిన్న జంగారెడ్డి, బూచి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వినయ్ భాస్కర్‌కు పోలీసులు క్షమాపణ చెప్పాలి

- ఎంజీఎంలో తోపులాట, గాయాలపై బీఆర్ఎస్ సర్పంచుల జేఏసీ ఆగ్రహం



అక్షరదర్బార్, పరకాల: ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భా స్కర్ ఎంజీఎం ఆసుపత్రిని సందర్శించేం దుకు వెళ్లిన సందర్భంగా పోలీసులు వ్యవ హరించిన తీరుపై బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు సనత్‌కు మార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజీఎం సందర్శనకు పోలీసులు అడుగడు గునా ఆటంకాలు సృష్టించారని మండిప డ్డారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న తోపు లాటలో వినయ్‌భాస్కర్ కాలు, చేతికి గాయాలై రక్తం కారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పేదల పక్షాన నిలిచి ఆసుపత్రి సమ స్యలను పరిశీలించేందుకు వెళ్తే ఇలా అడ్డు కోవడం గర్హనీయమన్నారు. ఎంజీఎంలో సరిపడా పడకలు లేకపోవడం, భవనం పైకప్పులు పెచ్చులూడటం, అంబులెన్సుల కొరత వంటి సమస్యలను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శిం చారు. పేదలకు కనీస వైద్యం అందని దుస్థితి నెలకొందని, ప్రజా పాలన అని ప్రచారం చేసుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని ధ్వజమెత్తారు. వినయ్‌భా స్కర్‌పై జరిగిన ఘటనకు పోలీసులు తక్షణమే క్షమాపణ చెప్పాలని సనత్‌కు మార్ డిమాండ్ చేశారు. ఇలాంటి దుశ్చర్యలు పునరావృతమైతే చూస్తూ ఊరు కునేది లేదని హెచ్చరించారు.

# లక్ష్మీనగర్ లో సీసీ రోడ్డు పనులు షురూ

- మంత్రి సీతక్క చిత్రపటానికి మహిళల క్షీరాభిషేకం



అక్షర దర్బార్, ములుగు: ములుగు పట్టణంలోని 4వ వార్డు లక్ష్మీనగర్ కాలనీలో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైన సందర్భంగా స్థానిక మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రజల చిరకాల అవసరాన్ని గుర్తించి సీసీ రోడ్డు నిర్మాణానికి సహకరించిన మంత్రి దనసరి అనసూయ సీతక్కకు ప్రత్యేక కృత జ్ఞతలు తెలుపుతూ, 4వ వార్డు కౌన్సిలర్ గుంటోజూ పావని ఆధ్వర్యంలో లక్ష్మీనగర్ కాలనీ మహిళలు మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రజల కష్టాలను, అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టడమే నిజమైన ప్రజా పాలనకు నిద ర్శనమని లక్ష్మీనగర్ మహిళలు పేర్కొన్నారు.



# గోదాములతో రైతన్నకు భరోసా

- తాడ్వాయిలో 10 వేల మెట్రిక్ టన్నుల గోదాముకు మంత్రి సీతక్క శంకుస్థాపన

అక్షర దర్బార్, ములుగు: రైతులు పండించిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్ప త్తులను సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు ప్రజా ప్రభుత్వం గోదాముల నిర్మాణం చేపడుతూ అన్నదాతలకు అండగా నిలుస్తోం దని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం తాడ్వాయి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాము నిర్మాణా నికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మంత్రి భూమిపూజ నిర్వ హించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తాడ్వాయి మండల రైతులకు ఉపయోగపడేలా భారీ సామర్థ్యంతో గోదాము నిర్మాణం చేపట్టడం ఎంతో సంతో షకరమన్నారు. రైతులు పంట ఉత్పత్తులను దాచుకునేందుకు సరైన వసతులు లేక రోడ్లపై ఆరబోయాల్సి వస్తోందని, అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవుతోందని గుర్తుచేశారు. ఈ గోదాము పనులను ఆరు నెలల్లోగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురా వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్ర మంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ సోమయ్య, సంబంధిత శాఖల అధి కారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మైనింగ్ కు వ్యతిరేకం కాదు

- గ్రామ నష్టానికే వ్యతిరేకం
- అవినీతి ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా
- సర్పంచ్ కొంగంటి తిరుపతి సవాల్




అక్షర దర్బార్, నడికూడ: కంఠాత్మ కూర్ గ్రామ పరిధి లోని చాకిరేవు గుట్టపై మైనింగ్ వ్యవహా రంలో తనపై వచ్చిన రూ.10 లక్షల ఆర్థిక డిమాండ్ ఆరోపణలను సర్పంచ్ కొంగంటి తిరుపతి తీవ్రంగా ఖండించారు. బుధవారం నడికూడ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎవరి వద్దా ఒక్క రూపాయి కూడా డిమాండ్ చేయలేదని, ఆ ఆరోపణలను నిరూపిస్తే సర్పంచ్ పదవికి తక్షణమే రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. తాను గుట్టపై మైనింగ్‌కు వ్యక్తిగ తంగా వ్యతిరేకం కాదని, అక్కడ తవ్వకాలు జరపడం వల్ల గ్రామానికి, రైతులకు జరిగే అపార నష్టానికే వ్యతిరేకమని తేల్చిచెప్పారు. మైనింగ్ తవ్వకాలతో మాటునాల రిజర్వా యర్ కింద ఉన్న 1,600 ఎకరాల ఆయకట్టు, పరిసరాల్లోని పురాతన ఆలయాలు, పంట పొలాలు, తాటి-ఈత వనాలు, హై లెవెల్ వంతెన ధ్వంసమయ్యే ప్రమాదం ఉందన్నారు. సెప్టెంబరు 1న నిర్వహించిన గ్రామసభలో మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానం ఆమోదించామని, గ్రామస్తులంతా జేఏసీగా ఏర్పడి ప్రజాస్వామ్య పద్ధతిలో పోరా డుతున్నారని తెలిపారు. ప్రభుత్వం మైనింగ్ లీజును రద్దు చేసేంత వరకు రైతులు, గ్రామస్తుల పక్షాన నిలిచి పోరాటం కొనసాగి స్తానని తిరుపతి ప్రకటించారు. సమావే శంలో శనిగరం సర్పంచ్ కొత్తపల్లి రాజు, మాదన్నపేట సర్పంచ్ కత్తి రమేష్, ధర్మారం సర్పంచ్ బాషిక ఎల్లస్వామి, రామకృష్ణా పురం మాజీ సర్పంచ్ పెండ్లి రాజు, కంఠాత్మ కూర్ ఉపసర్పంచ్ కుమారస్వామి, మాదన్న పేట రైతు బుర్ర కర్ణాకర్, కంఠాత్మకూర్ మాజీ సర్పంచ్ కొమురయ్య పాల్గొన్నారు.



## హర్షవర్ధన్ రెడ్డి కుటుంబానికి

# గండ్ర పరామర్శ

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు బీరం లక్ష్మారెడ్డి ఇటీవల మృతి చెందారు. బుధవారం భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సింగోటంలోని లక్ష్మారెడ్డి స్వగృహానికి వెళ్లారు. అక్కడ లక్ష్మారెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, హర్షవర్ధన్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# వడ్ల కొనుగోలుకు 170 సెంటర్లు

### 1,05,400 టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

- జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్




అక్షర దర్బార్, భూపాలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించడానికి పక్కా ప్రణాళికతో ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ పి అశోక్‌కుమార్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుంచి వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సంచాలకులు గోపి, మార్కెటింగ్ శాఖ సంచాలకులు రాహుల్ రాజ్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ నుంచి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 170 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 123, ఐకేపీ ద్వారా 40, జీసీసీ ద్వారా 5 కేంద్రాలు ఉంటాయని చెప్పారు. సుమారు 1,05,400 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాంటాలు తదితర పరికరాలను ముందుగానే సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరికరాల వినియోగం, సంరక్షణపై నిర్వాహకులు బాధ్యత వహించాలని, నిర్లక్ష్యం వల్ల దెబ్బతిన్న పరికరాల నష్టాన్ని కమిషన్ నుంచి కోత విధించే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ స్పష్టం చేశారు.

#### ప్రత్యామ్నాయ స్థలాల గుర్తింపు

ముంపునకు గురయ్యే అవకాశమున్న 12 కొనుగోలు కేంద్రాలకు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించాలని, ధాన్యం నిల్వకు ఫంక్షన్‌హాళ్లు, ప్రైవేటు గోదాములు, సీఏపీ స్థలాలను గుర్తించాలని అశోక్‌కుమార్ ఆదేశించారు. సుమారు 37.60 లక్షల గోనె సంచులు అవసరమవుతున్నందున వాటిని ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి బాబూరావు, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, సహకార అధికారి వాలియా నాయక్, తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక శాస్త్రవేత్త డా మదన్ మోహన్ రెడ్డి, అదనపు డీఆర్డీఓ చౌహాన్, మహాదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో రాణిస్తేనే బంగారు భవిష్యత్తు

#### గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు



అక్షరదర్బార్, నర్సంపేట : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు అన్నారు. వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి పరుగు పోటీలలో గీతాంజలి పాఠశాల విద్యార్థులు జి. దీప, టి. రాజేందర్, పి. వినీల్ సాయి, ఎండి. అల్వీన, బి. హర్షిత, జి. చరణ్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు విజేతలను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే చదువుతో పాటు ఆటలపై కూడా దృష్టి సారిస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. రాజేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 13 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

- అక్టోబర్ 6 ఆఖరు తేదీ
- సీడీపీవో స్వాతి

అక్షరదర్బార్, దామెర : హనుమకొండ జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని పరకాల డివిజన్‌లో ఖాళీగా ఉన్న 13 అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో స్వాతి తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి 2026 అక్టోబర్ 6వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు గడువు ఉందని చెప్పారు. మండలాల వారీగా ఖాళీలు: పరకాల-1, శాయంపేట-2, ఆత్మకూర్-2, దామెర-7, నడికూడ-1 ఖాళీలు ఉన్నాయి. అర్హతలు, వయస్సు తదితర వివరాలతో పాటు ఆన్‌లైన్ దరఖాస్తు కోసం అభ్యర్థులు http://wdcw.tg.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె సూచించారు.



## దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవాలి

- పీఎం ముద్ర యోజనపై అవగాహన సదస్సు
- దుగ్గొండి ఎస్ఐ రణధీర్ రెడ్డి



అక్షరదర్బార్, దుగ్గొండి : దివ్యాంగులు అధైర్యపడకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో స్వయం ప్రతిపత్తితో రాణించాలని దుగ్గొండి సబ్ ఇన్‌స్పెక్టర్ రణధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో ఎన్‌పీఆర్‌డీ అసోసియేషన్ సభ్యుల కోసం పీఎం ముద్ర యోజన, ఉద్యం రిజిస్ట్రేషన్‌పై ఒకరోజు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ, పీఎం ముద్ర, పీఎం స్వనిధి పథకాల ద్వారా రుణాలు పొంది ఆర్థిక సాధికారత సాధించాలని సూచించారు. వరంగల్ జిల్లా పరిశ్రమల శాఖ ఈడీసీ మేనేజర్ శ్రీలత, అసిస్టెంట్ మేనేజర్ సందీప్ కుమార్‌లు రిసోర్స్ పర్సన్లుగా హాజరై చిన్న వ్యాపారాల స్థాపన, రిజిస్ట్రేషన్, రుణాల మంజూరు విధానాన్ని వివరించారు. ఎన్‌పీఆర్‌డీ ఇండియా మండల అధ్యక్షులు చింత కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సభలో జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు, జిల్లా అధ్యక్షులు అడ్డా రాజు, నాయకులు కందికొండ రాజకుమార్, యారా శ్రీను, కరుణాకర్, ఎల్లస్వామి, సుమలత పాల్గొన్నారు.

## లక్కీ డ్రాలో స్కూటీ గెలుచుకున్న దామోదర్ రెడ్డి



అక్షరదర్బార్, భూపాలపల్లి రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని మంజూర్ నగర్ శ్రీ వినాయక కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో టోకెన్ నంబర్ 144 కలిగిన గోలి దామోదర్ రెడ్డి మొదటి బహుమతిగా స్కూటీని గెలుచుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రూ.500 చొప్పున 600 టోకెన్లను విక్రయించి లక్కీ డ్రా తీశారు. 9వ వార్డు కౌన్సిలర్ అప్పం కిషన్, కాలనీ అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, గౌరవ అధ్యక్షులు సామల లక్ష్మారెడ్డి, తోటపల్లి వైకుంఠంల సమక్షంలో డ్రా ప్రక్రియ చేపట్టారు. రెండో బహుమతి (1 గ్రాము బంగారం) టోకెన్ నంబర్ 105 గుర్రం మనవితా గౌడ్ (పెద్దాపూర్), మూడో బహుమతి (2 తులాల వెండి) టోకెన్ నంబర్ 522 సుబ్రహ్మణ్యస్వామి, నాలుగో బహుమతి (పట్టుచీర) బల్ల మహేందర్ (అడ్వకేట్, జీఎంఆర్ వెంచర్) దక్కించుకున్నారు. విజేతలకు కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పైతరి మహేష్, కోశాధికారులు పసునూటి సుమన్, పంచనేని రామారావు, కార్యదర్శి చల్ల రవిందర్ రెడ్డి, ముఖ్య సలహాదారు సల్ల సంపత్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ కర్రె రాజు, సభ్యులు పాల్గొన్నారు.

# మన్నెం సరోజన మృతికి రెడ్డి సంక్షేమ సంఘం సంతాపం

- బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



అక్షర దర్బార్, దామెర : దామెర మండలం ఒగ్లాపూర్ గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు మన్నెం ఇంద్రారెడ్డి, మన్నెం రమణారెడ్డి, మన్నెం జయపాల్ రెడ్డిల తల్లి మన్నెం సరోజన ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం వారి స్వగృహంలో రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారికి ధైర్యం చెబుతూ సంఘం తరఫున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కేతిపెల్లి శ్రీధర్ రెడ్డి, నాయకులు పలకల శ్రీనివాస్ రెడ్డి, మన్నెం ప్రకాష్ రెడ్డి, పలకల సాంబశివరెడ్డి, వంచ రవీందర్ రెడ్డి, గౌంది చంద్రారెడ్డి, మన్నెం రఘుపతి రెడ్డి, గోగుల రాజేందర్ రెడ్డి, మన్నెం రాజిరెడ్డి, గోగుల సమ్మిరెడ్డి, మన్నెం రాంరెడ్డి, మన్నెం శ్రీనివాస్ రెడ్డి, మన్నెం తిరుపతిరెడ్డి, కేతిపెల్లి రఘుపతి రెడ్డి, మన్నెం రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 28న మొగుళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ఈ నెల 28వ తేదీ సోమవారం నాడు మొగుళ్లపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేందర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గ్రామ పంచాయతీల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల ప్రగతిపై నిర్వహించే సమీక్షలో పాల్గొనాలని ఆయన కోరారు.

# లక్కీ డ్రాలో వినాయక లడ్డూ కైవసం

- గెలుచుకున్న డాక్టర్ రవికృష్ణ-అమల దంపతులు



అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని వినాయక మిత్ర మండలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా బుధవారం లడ్డూ లక్కీ డ్రా నిర్వహించారు. ఇందులో పట్టణానికి చెందిన ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ రవికృష్ణ-అమల దంపతులు ప్రధాన వినాయకుడి లడ్డూను గెలుచుకున్నారు. ఇతర డ్రాలలో కిలో లడ్డూను డాక్టర్ హిమబిందు-విశ్వనాథ్ దక్కించుకోగా, కరెన్సీ నోట్ల హారాల డ్రాలను అనూష-రాజు దంపతులు, స్రవంతి-శ్రీకాంత్ దంపతులు, బండి అరుణ-కొమురయ్య దంపతులు గెలుచుకున్నారు. విజేతలను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మోర్తాల రామరాజు, అనుమాండ్ల రవికృష్ణ, వీరారెడ్డి, బద్రి, కమలాకర్, జైపాల్ రెడ్డి, శ్రీధర్, సత్యనారాయణ, పుట్ట రవి, జెట్టి రవి, శ్రీనివాస్ రెడ్డి, అల్లం రాజు, బానోతు రాజు, మహిళలు పాల్గొన్నారు.









# పరకాల చలివాగులో ఘనంగా గణనాథుల నిమజ్జనం

- తొలి విగ్రహానికి పూజలు చేసిన మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్‌కుమార్



అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథుల నిమజ్జన శోభాయాత్ర బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. చలివాగు వద్ద మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్‌కుమార్ కౌన్సిలర్లతో కలిసి తొలి వినాయక ప్రతిమకు శాస్త్రోక్తంగా పూజలు చేసి నిమజ్జనం చేయడంతో ఘట్టం మొదలైంది. మండపాల వద్ద ప్రత్యేక పూజల అనంతరం స్వామివార్లను వాహనాలలో కొలువు దీర్చి ఊరేగింపుగా చలివాగుకు తరలించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు భజనలు, డప్పు చప్పుళ్లు, కోలాటాలతో నృత్యాలు చేశారు. ఏర్పాట్లను ఏసీపీ సతీష్‌బాబు, ఆర్డీవో డీఎస్ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ పవన్, తహసీల్దార్ విజయలక్ష్మి, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కొలుగూరు రాజేశ్వరరావు తదితర అధికారులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సహకరించిన అధికారులకు, సిబ్బందికి చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు.





## ఈనెల 25న బీఆర్ఎస్ ములుగు మండల ముఖ్య కార్యకర్తల భేటీ

అక్షర దర్బార్, ములుగు: ఈ నెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ములుగు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ ములుగు మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ తాజా మాజీ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి తెలిపారు. సమావేశానికి ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, కౌన్సిలర్ అభ్యర్థులు, తాజా మాజీ మండల కమిటీ సభ్యులు, సర్పంచులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్లు, మాజీ ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, యూత్ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## తాడిచర్లలో వైభవంగా మహా అన్నదానం


- పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ

అక్షరదర్బార్, మల్హర్: తాడిచర్ల గ్రామంలోని పద్మశాలి వినాయక మండపం వద్ద వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భారీ మహా అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. సంఘం అధ్యక్షుడు వేమల రాజమల్లు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అని, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కంటే మిన్నయైన కార్యం మరొకటి లేదన్నారు. వార్డు సభ్యుడు కామ బాపు గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విగ్రహ దాతలు చిందం భాస్కర్-హసిని దంపతులు స్వామివారికి పూజలు నిర్వహించగా, అధ్యక్షుడు వేమల రాజమల్లు స్వయంగా అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ముడతనపెల్లి భూమయ్య, ముడతనపెల్లి నారాయణ, ముడతనపల్లి సంపత్, ఇప్పకాయల బాపు, ఇప్పకాల రాకేష్, ఇప్పకాల శంకరి, బుర్ల రాజేశం, బుర్ల శ్రీనివాస్, బుర్ల నరేష్, పినుమండ్ల శ్రీనివాస్, పినుమండ్ల నరహరి, ఇంజాపూర్ వెంకటేశం, ఇంజాపూరి రాజేశం, జల్లారపు లక్ష్మయ్య, జల్లారపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# పెన్షన్ కలెక్షన్స్

- పింఛన్ దరఖాస్తుదారుల నుంచి అధికారుల వసూళ్ల పర్వం!
- రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు
- కొర్రీల పేరుతో భయాందోళనలు..
- పారదర్శకంగా అమలు చేయాలని బాధితుల వేడుకోలు



అక్షర దర్బార్, నర్సంపేట: అర్హులైన లబ్ధిదారులందరికీ కొత్త పెన్షన్లు అందజేయాలనే ప్రభుత్వ ఆశయానికి క్షేత్రస్థాయి అధికారులు, చోటామోటా నాయకులు గండికొడుతున్నారు. నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియలో తీవ్రస్థాయిలో వసూళ్ల పర్వం సాగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికి పెన్షన్ మంజూరులో నిబంధనలు పక్కన పెడుతున్న అధికారులు, ఇతరులకు మాత్రం రకరకాల కొర్రీలు పెడుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. "ఇతర ప్రభుత్వ పథకాలు పొందితే పెన్షన్ రాదు", "కొడుకులు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు" అంటూ రకరకాల కారణాలు చెప్పి దరఖాస్తుదారులను భయబ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో దరఖాస్తుదారుడి నుంచి రూ.5 వేల నుండి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నర్సంపేట డివిజన్‌లోని పలు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు అధికారులతో చేతులు కలిపి ఈ దందా నడుపుతున్నట్లు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కొత్త పెన్షన్‌కు ఇన్‌కమ్ సర్టిఫికెట్ తప్పనిసరి అని నిబంధన పెట్టడంతో, రెవెన్యూ కార్యాలయాల్లో సైతం సర్టిఫికెట్ల మంజూరు కోసం విచ్చలవిడిగా వసూళ్లకు పాల్పడుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గతంలో అక్రమాలు..

### నేడు అర్హులకు ఆటంకాలు

గత పదేళ్ల ప్రభుత్వ హయాంలో ఆధార్ కార్డుల్లో వయస్సు తగ్గించుకుని/పెంచుకుని అక్రమ పద్ధతిలో పెన్షన్లు పొందిన వారు కొందరైతే, సదరం క్యాంపులలో డాక్టర్లు, మధ్యవర్తులకు డబ్బులు ముట్టజెప్పి నకిలీ వైకల్య ధృవీకరణ పత్రాలు పొందిన వారు మరికొందరు. అలా అక్రమార్కులు లబ్ధి పొందగా, నేటి ప్రభుత్వంలో సర్వహక్కులు ఉన్న నిజమైన అర్హులకు "అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని" అన్నట్లుగా అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి.

### నకిలీ సర్టిఫికెట్లపై చర్యలు తీసుకోవాలి!

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపించాలి. గతంలోనూ, ప్రస్తుతం పెన్షన్ పొందుతున్న వారి వివరాలపై ప్రత్యేక నిఘా ఉంచి గ్రామాల వారీగా విచారణ చేపట్టాలి. మీసేవ సెంటర్ల ద్వారా ఆధార్ కార్డుల్లో వయస్సు మార్పిడి చేసి వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వారిపై, వారికి సహకరించిన మీసేవ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి. డబ్బులు తీసుకుని నకిలీ సదరం సర్టిఫికెట్లు జారీ చేసిన డాక్టర్లు, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

అక్రమ పింఛన్లను రద్దు చేసి, అర్హులైన పేదలందరికీ పారదర్శకంగా పెన్షన్లు మంజూరు చేస్తేనే ప్రస్తుత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని నర్సంపేట డివిజన్ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## హోంగార్డ్ కుటుంబానికి చెక్కు

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్ గోలి శ్రీనివాస్ ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరపున వెల్ఫేర్ ఎక్స్‌గ్రేషియా కింద మంజూరైన రూ.20 వేల చెక్కును జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డ్ గోలి శ్రీనివాస్ అకాల మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ వెల్ఫేర్ పథకాలు సిబ్బంది కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించడంలో కీలకంగా నిలుస్తాయనీ ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ సంతోష్ కుమార్ పాటు హోంగార్డ్ గోలి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## విఘ్నేశ్వరుడికి భక్తితో వీడ్కోలు!

- జోరు వానలోనూ సాగిన శోభాయాత్ర.. పోలీసుల పటిష్ట బందోబస్తు

అక్షర దర్బార్ ,మొగుళ్లపల్లి: గత తొమ్మిది రోజుల నుండి భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న విఘ్నేశ్వరునికి భక్తజనం ఘనంగా నీరాజనం పలికారు. ఒకవైపు జోరుగా వాన కురుస్తున్నా భక్తులు లెక్కచేయకుండా గణనాథునికి తుది వీడ్కోలు పలికారు. సాయంత్రం నాలుగు గంటల నుండి పిడుగులతో కూడిన వర్షం మొదలు కావడంతో నిర్వాహకులు కొంత ఆందోళన చెందినప్పటికీ, సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో వరుణ దేవుడు కరుణించడంతో విఘ్నేశ్వరునికి వీడ్కోలు పలికేందుకు సులభతరమయ్యింది. విఘ్నేశ్వరుని శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించేందుకు చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ వై. సతీష్, మొగుళ్లపల్లి ఎస్సై సురేష్ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి, వర్షం కురుస్తున్నప్పటికీ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు వాతావరణ సూచనలను ప్రజలకు సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తూ అప్రమత్తం చేశారు. చిట్యాల, మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గణేష్ నిమజ్జన కార్యక్రమం రాత్రి 10 గంటల దాకా కొనసాగి సంపూర్ణంగా, ప్రశాంతంగా ముగిసింది.



## నేడు అంగన్వాడీ, స్కూల్స్, కాలేజీలకు సెలవు

అక్షరదర్బార్, హనుమకొండ: వాతావరణ సూచనల నేపథ్యంలో జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా గురువారం అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలకి, కాలేజ్ లకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి బదులుగా అక్టోబర్ 10న (రెండో శనివారం) పనిదినంగా భావించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# వినాయక సెలవిక

- గంగమ్మ ఒడికి గణపయ్య
- భక్తిశ్రద్ధల మధ్య గణనాథునికి ఘన వీడ్కోలు
- చెరువుల వద్ద వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం
- ప్రశాంత వాతావరణంలో శోభాయాత్రలు..
- వర్షంలోనూ ప్రత్యేక పూజలతో సాగిన ఊరేగింపులు



అక్షరదర్బార్, వరంగల్: త్రిశీల నగరం బుధవారం భక్తిపారవశ్యంతో పులకించిపోయింది. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న లంబోదరుడు గంగమ్మ ఒడికి చేరాడు. వరంగల్‌లోని చిన్న వడ్డేపల్లి చెరువులో వినాయక నిమజ్జనోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. కోలాటాలు, డప్పు వాయిద్యాల మోతలు, భక్తుల జయజయధ్వానాల నడుమ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి గణనాథుల విగ్రహాలను ఊరేగింపుగా శోభాయాత్రగా చెరువుల వద్దకు తరలించారు. జీడబ్ల్యూఎంసీ పరిధిలో 17 చెరువుల వద్ద వినాయక నిమజ్జనం జరిగింది. సుమారు 8 వేల వినాయక విగ్రహాలు ఈ చెరువుల వద్దకు నిమజ్జనానికి తరలివచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు.

### - లాంఛనంగా ప్రారంభించిన ప్రముఖులు

వరంగల్ చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద నిమజ్జన కార్యక్రమాన్ని కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత కొబ్బరికాయలు కొట్టి లాంఛనంగా ప్రారంభించారు.

అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు స్వయంగా క్రేన్ సాయంతో చెరువులో ఏర్పాటు చేసిన నీటి తెప్పలపైకి దిగి విగ్రహాలను నిమజ్జనం చేశారు. నిమజ్జన ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు.

### 2,500 విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు:

ఈ సందర్భంగా కుడా ఛైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ చెరువు వద్దకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి సుమారు 2,500 విగ్రహాలు నిమజ్జనానికి రానున్నాయని పేర్కొన్నారు. 'కుడా' పరిధిలోని అన్ని నిమజ్జన ప్రాంతాల వద్ద పక్కా ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. నిమజ్జన ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా అహర్నిశలు శ్రమిస్తున్న పోలీస్, రెవిన్యూ, జీడబ్ల్యూఎంసీ, కుడా, విద్యుత్, ఇరిగేషన్, మత్స్య శాఖ, ఆర్అండ్ బీ, ఫైర్ తదితర శాఖల అధికారులకు, సిబ్బందికి ఆమె అభినందనలు తెలిపారు.



### - భక్తులకు సకల సౌకర్యాలు

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులంతా ప్రశాంత వాతావరణంలో స్వామివారికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.





## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్
- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

అక్షరదర్బార్, వరంగల్: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులు సూచించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని, లోతట్టు ప్రాంతాలు, చెరువులు, వాగులు, నాలాల సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాల కారణంగా నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున వాగులు, కాలువలు, చెరువులు దాటే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఏవైనా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నట్లయితే ప్రజల అవసరం నిమిత్తం టోల్‌ఫ్రీ నంబర్ 18004253424 లేదా 9154252936కు ఫోన్ చేసి సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## నేడు కేటీపీపీకి బీఆర్ఎస్ బృందం

- జయప్రదం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు జీవీఆర్ పిలుపు

అక్షరదర్బార్, గణపురం: రాష్ట్రంలోని ఆరు థర్మల్ విద్యుత్ ఓవర్ ప్రాజెక్టులను గురువారం సందర్శించేందుకు బీఆర్ఎస్ నిర్ణయించింది. రాష్ట్రంలో నెలకొన్న విద్యుత్తు కోతలతో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. రాష్ట్రంలోని ఆరు థర్మల్ పవర్ విద్యుత్ కేంద్రాలకు బీఆర్ఎస్ బృందాలు వెళ్తాయని ఆయన తెలిపారు. ఇందులోభాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం మండలం చెల్పూరు వద్ద ఉన్న కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ)ని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ తదితరులతో కూడిన బృందం సందర్శించనిందని సందర్శిస్తుందని కేటీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో కేటీపీపీ సందర్శనను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపు ఇచ్చారు.

## వినయ్ కు కేసీఆర్ ఫోన్

- 'ఉద్యమ నాటి రోజులను గుర్తుచేశావు తమ్ముడూ!' అని ప్రశంస



అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి సందర్శన సందర్భంగా పోలీసుల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ నేత, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్‌ను బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మంగళవారం రాత్రి ఫోన్ లో పరామర్శించారు. వినయ్ భాస్కర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న కేసీఆర్.. ఆయన ధైర్యాన్ని అభినందించారు. "తమ్ముడు వినయ్.. నాటి తెలంగాణ ఉద్యమ రోజులను మళ్ళీ గుర్తుచేశావు" అని ప్రశంసించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను ఆపవద్దని, బీఆర్ఎస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

### - కేటీఆర్, హరీష్ రావుల పరామర్శ

పోలీసుల దాడి ఘటనపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సైతం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వినయ్ భాస్కర్‌కు ఫోన్ చేసి పరామర్శించిన నేతలు.. ఆయన క్షేమ సమాచారాన్ని తెలుసుకుని, పార్టీ నుంచి పూర్తి మద్దతు ఉంటుందని ధైర్యం చెప్పారు.

## ఎన్సీసీ క్యాడెట్లకు శిక్షణ

అక్షరదర్బార్, మామునూరు: మామునూరు పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ లోని ఎన్సీసీ కంబైన్డ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో ఈనెల 20 నుంచి ఎన్సీసీ క్యాడెట్లకు శిక్షణ నడుస్తుంది. 29 ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్ రిపబ్లిక్ డే క్యాంపు, యువ ఆపద మిత్ర స్కీం, వాయు సైనిక్ క్యాంప్, డ్రోన్ క్లాసెస్ కొరకు వరంగల్ గ్రూప్ లోని అన్ని బెటాలియన్ల నుండి వచ్చిన సుమారు 700 మంది ఎన్సీసీ క్యాడేట్ లు శిక్షణలో పాల్గొంటున్నారు. యువత బాధ్యత కల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్సీసీ కీలక పాత్ర పోషిస్తుందని క్యాంప్ కమాండెంట్ కల్నల్ సంతోష్ మెహెర్ తెలిపారు. అసిస్టెంట్ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ విజయకుమార్ టి, క్యాంప్ సీనియర్ జేసీఓ సంజయ్ రానా, క్యాంప్ అడ్జుటెంట్ లెఫ్టినెంట్ బి సబిత, క్యాంప్ వాటర్ మాస్టర్ సుమలత, క్యాంప్ జీసీఐకేఎస్ఎస్ సుజిత, గాయత్రి, బీహెచ్ఎం అమోల్ గవాయి, ట్రైనింగ్ జేసీఓ సుబేదార్ రమేష్, ఎన్ సీఓ హవల్దార్ దినేష్, అసోసియేట్ ఎన్సీసీ ఆఫీసర్లు, పీఐ స్టాఫ్, సివిలియన్ స్టాఫ్ శిక్షణ ఇస్తున్నారు.

